ఉత్తర ద్వార దర్శనం..భక్తి పారవశ్యం

- వైభవంగా ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి
- ఆలయాల్లో భక్తుల సందడి

బోథ్: ఉత్తర ద్వారం ద్వారా ఉత్సవమూర్తుల విగ్రహాలను లోనికి తీసుకెళ్తున్న భక్తులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23 : ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువును ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే ముక్తి ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలోనే పట్టణంలోని మార్వాడి ధర్మశాలలో ఉన్న వేంకటేశ్వర స్వామిని మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జైనథ్, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి పల్లకీని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఉత్తరద్వారం గుండా స్వామిని దర్శించుకున్నారు. అలాగే కూరలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

ఆదిలాబాద్‌రూరల్: వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

బోథ్, డిసెంబర్ 23: వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుచులాపూర్ ఎక్స్‌రోడ్డులో ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఉత్సవ మూర్తుల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోని ప్రవేశం కల్పించి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. వేద పండితులు సదానందశర్మ, అరవింద్‌రావుశర్మ, రమేశ్‌శర్మ గోవింద నామాలు స్మరించారు. బోథ్, కుచులాపూర్, కౌఠ (బీ), పొచ్చెర, ధన్నూర్(బీ), కన్గుట్ట, పట్నాపూర్, మర్లపెల్లి గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉపవాస దీక్షలు కావడంతో భక్తులకు ప్రసాదం రూపంలో పండ్లు పంపిణీ చేశారు.

భీంపూర్, డిసెంబర్ 23 : మండలంలోని కరంజి(టీ), అర్లి(టీ) రామాలయాలు, నిపాని, పిప్పల్‌కోటి వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీలు భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆదిలాబాద్‌లోని పలు వైష్ణవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే పాయల్ శంకర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామిని ఉత్తర ద్వారం గుండా దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

జైనథ్, డిసెంబర్ 23 : జైనథ్ మండలం కంఠ గ్రామంలోని రైతువేదికలో శనివారం ఐఎన్‌టీఎల్-29 పీయూ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీఎల్ -29 పీయూ మేనేజర్ సీహెచ్ జ్యోతి మాట్లాడుతూ దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను రైతులకు వివరించారు. దేశ్‌పాండే ఫౌండేషన్ ఉత్తమ పద్ధతులు పాటిస్తున్న రైతులను ఎంపిక చేసి వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ స్టాఫ్ సత్యనారాయణ, రాజేందర్, గజానన్ పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23 : ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేవీకే భవనంలో కిసాన్ దివాస్ (రైతు దినోత్సవం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ డీ మోహన్ దాస్, డాక్టర్ పోషాద్రి, డాక్టర్ ఎం సునీల్‌కుమార్, డాక్టర్ జీ శివచరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు, ఎత్తు మడుల పద్ధతి, అంతర పంటల సాగు, పంట మార్పిడి, శనగ, సోయా, జొన్న, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు, గులాబీ రంగు పురుగు, కాయ కుళ్లు నివారణ, ఆయిల్ ఫామ్ సాగు, ఉత్పత్తిదారుల సంఘాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మమత, నాన్ టీచింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాములుగూడలో..

ఆదిలాబాద్ రూరల్ మండలం రాములుగూడ గ్రామంలో కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మిత్ర కోఆర్డినేటర్లు ఆవుల రాకేశ్, మేకల రమాకాంత్ మాట్లాడుతూ రైతులకు ఏమైన సమస్యలుంటే కిసాన్ మిత్ర హెల్ప్ లైన్ నంబర్ 1800-120-2344ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండాలి

బోథ్, డిసెంబర్ 23: రైతులకు అందరూ అండగా ఉండాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ధన్నూర్(బీ) గ్రామంలో రైతులు సింగం భోజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంగెపు లస్మయ్య, గజ్జల లస్మన్న, దామెర్ల ప్రణీత్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రైతులు శ్యాంసుందర్‌రెడ్డి, సహేందర్‌రెడ్డి, గోపి, గంగారెడ్డి, రమేశ్, రాంరెడ్డి పాల్గొన్నారు. కన్గుట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు చిలుక సతీశ్‌కుమార్ విద్యార్థులతో కలిసి రైతులను సన్మానించారు. బోథ్‌లోని నాగభూషణం ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించారు. పాఠశాలలో వ్యవసాయ పనిముట్లు, అరక సామగ్రితో ప్రదర్శన నిర్వహించారు. కరస్పాండెంట్ కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనథ్: కంఠ గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతులు

బోథ్: అరక సామగ్రి, వ్యవసాయ పనిముట్లతో ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

26న మండల, డివిజన్ కమిటీ ఎన్నికలు

మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్

ఇంద్రవెల్లి, డిసెంబర్ 23: ఈ నెల 26న తుడుందెబ్బ మండల, డివిజన్ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్కా బాపురావ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడుందెబ్బ పాత కమిటీలను రద్దు చేసినట్లు తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఈ నెల 26న ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నూతన మండల, డివిజన్ కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఉట్నూర్, బోథ్, ఆదిలాబాద్, డివిజన్‌కు చెందిన 9తెగల ఆదివాసీ యువకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు శంకర్, రమేశ్, భోజన్న, భరత్, రఘునాథ్, తొడసం భగవంత్‌రావ్, ఆర్కా రమణ, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సవరించాలి

తాంసి, డిసెంబర్ 23 : పార్లమెంట్ ఎన్నికల దృశ్య ఓటరు జాబితాను సవరించి ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని నాయబ్ తహసీల్దార్ విష్ణు జాదవ్ బీఎల్వోలకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో శనివారం బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటరు జాబితా అప్డేషన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరేశ్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సిబ్బంది ప్రశాంత్, స్వాగత్, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్, అధికారులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

బోథ్, డిసెంబర్ 23 : మండల కేంద్రంలో చేపడుతున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణ పనులను శనివారం విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ నర్సింహులు పరిశీలించారు. వివరాలను స్థానిక సంఘ నాయకులను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇక్కడ జిల్లా కోశాధికారి దశరథ్, శ్రీకర్, మెడిచెల్మ ప్రవీణ్, రమేశ్, రంగు రాజు, ప్రసాద్, నరేందర్, కృష్ణ ఉన్నారు.

పనులు పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు, సభ్యులు

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

ఎదులాపురం, డిసెంబర్ 23 : బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఖయ్యూం అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న శనివారం దవాఖానకు వెళ్లి ఖయ్యూంను పరామర్శించారు. ఆరోగ్య సమస్యలను రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నాయకుడు సాజిద్ ఉద్దీన్ ఉన్నారు.

పరామర్శిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

● ఎమ్మెల్యేలకు సన్మానం

ఇటీవల ఎమ్మెల్యేలుగా గెలుపొందిన పాయల్ శంకర్, జాదవ్ అనిల్, వెడ్మబొజ్జు పటేల్‌ను శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. -ఎదులాపురం, డిసెంబర్ 23

● ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్, డిసెంబర్ 23: మండల కేంద్రంలోని సెంట్‌పాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో క్రిస్మస్ ముందస్తు వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరుకాగా పాఠశాల సిబ్బంది ఆయనను ఘనంగా స్వాగతించి సత్కరించారు. అనంతరం కేక్ చేసి సిబ్బందికి తినిపించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

జైనథ్, డిసెంబర్ 23 : మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన వాన్కడే గణేశ్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం కాగా ఇంటి సభ్యులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులకు 108 లో రిమ్స్‌కు తరలించారు. కాగా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ఇందులో ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంట్లో రూ.30 వేల నగదు, ఫ్రిజ్, పత్తి పంట, ఇతర సామగ్రి కాలిపోగా సుమారు రూ.4 లక్షల 50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జైనథ్ ఎస్ఐ పురుషోత్తమ్ తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

జైనథ్, డిసెంబర్ 23: మండలంలోని మేడిగూడ (ఆర్) గ్రామానికి చెందిన అరుగుల రాంచరణ్(16) శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. పోలీసుల వివరాలు ప్రకారం.. రాంచరణ్ తరచుగా కడుపు నొప్పితో బాధపడే వాడు. ఈ క్రమంలో కడుపు నొప్పి భరించలేక ఇంట్లో మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. రాంచరణ్ జైనథ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి అరుగుల దేవన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

28న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ఎదులాపురం, డిసెంబర్ 23 : జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కే మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దివ్యాంగ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, దివ్యాంగ స్వయం సహాయక గ్రూపు సభ్యులు , స్వచ్ఛంద సంస్థలు పాల్గొనలని పేర్కొన్నారు. ఈ వేడుకలకు ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ, డిసెంబర్ 23 : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ నరేశ్ అన్నారు. శనివారం మండలంలోని బాబ్జీపేట్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు

తాంసి, డిసెంబర్ 23 : పొన్నారి గ్రామంలో శనివారం మురళీకృష్ణ ఆలయం వద్ద గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పుస్తకాలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అండె అశోక్ మాట్లాడుతూ మానవజాతికి దివ్య మార్గం చూపే హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత అని అన్నారు. యువత భక్తి మార్గంలో నడవాలని, ఈ నెల 25న దుండిగల్ సుందర చైతన్య ఆశ్రమంలో పూజా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముచ్చ రేఖ- రఘు, సుభాష్, ఈదపు మహేందర్, తొగరి సురేందర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

28న ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23 : ఆదిలాబాద్ టీఎస్ ఆర్టీసీలో ఐటీఐ అప్రెంటిస్ కోసం నమోదు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆర్ఎం సోలేమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 15 లోపు ఆర్టీసీ అధికార వెబ్‌సైట్ https:// www. apprentice shipindia. orgలో నమోదు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

కొలం ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23 : ఆదిలాబాద్‌లోని కొలం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సర్ఫరాజ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వంటగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

బోథ్, డిసెంబర్ 23 : బోథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష పదవికి ఎలేటి సంజీవ రెడ్డి శనివారం రాజీనామా చేశాడు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఇన్‌చార్జి కార్యదర్శి దేవన్నకు అందజేశారు. ఈ నెల 20న జరిగిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో సమస్యలపై చర్చించగా జిల్లా మార్కెటింగ్ అధికారి తీరు నచ్చకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌గా రాజీనామా చేయాలి

భీంపూర్, డిసెంబర్ 23 : ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం సరికాదని జాదవ్ అనిల్ యువసేన ప్రతినిధి షేక్ అఫ్రోజ్, రైతులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ గ్రామం పిప్పల్‌కోటి సొసైటీ నుంచే బీఆర్ఎస్ పార్టీ బలంతో సభ్యులైన రైతులంతా భోజారెడ్డిని డైరెక్టర్‌గా ఎన్నుకున్నారని వారు గుర్తుచేశారు. బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేసిన డీసీసీబీ చైర్మన్ నైతిక బాధ్యతగా పిప్పల్‌కోటి సొసైటీ డైరెక్టర్ పదవికి కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే భీంపూర్ మండలం వడూర్ గ్రామానికి చెందిన భోజారెడ్డి తనకు ఇంత ఉన్నతిని ఇచ్చిన పార్టీని , ప్రజలను మరిచిపోవడంపై 26 పంచాయతీలు ,అనుబంధ గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు విచారం వ్యక్తం చేశారు.

రాష్ట్ర రెడ్డి ఐక్య వేదిక యువజన కార్యదర్శిగా క్యాతం శివప్రసాద్ రెడ్డి

జైనథ్, డిసెంబర్ 23 : మండలంలోని మేడిగూడ(ఆర్) గ్రామానికి చెందిన క్యాతం శివప్రసాద్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక యువజన సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో రెడ్డి ఐక్య వేదిక కోర్ కమిటీ సభ్యులు ఏనుగు సుభాష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శివప్రసాద్ రెడ్డికి నియామక పత్రం అందజేశారు.

శబరిమాతాజీ భక్తుల పాదయాత్ర

బోథ్, డిసెంబర్ 23: కౌఠ(బీ) గ్రామానికి చెందిన శబరి మాతాజీ భక్తులు శనివారం పాదయాత్ర చేపట్టారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తి గీతాలు ఆలపిస్తూ పాదయాత్రగా బయలు దేరారు. ఆరు కిలోమీటర్ల దూరంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు భజన సంకీర్తలు ఆలపిస్తూ పాదయాత్ర చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రావణ్‌రెడ్డి, పోతన్న, సుజాత, గీత పాల్గొన్నారు.

పాదయాత్రగా వెళ్తున్న శబరిమాతాజీ భక్తులు

ఎన్‌సీసీ-సీఏటీసీ క్యాంపులో మెరిసిన విద్యార్థులు

పతకాలు చూపిస్తున్న గిరిజన గురుకుల విద్యార్థులు

ఇచ్చోడ, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆదిలాబాద్‌లో నిర్వహించిన ఎన్‌సీసీ-సీఏటీసీ క్యాంపులో ప్రతిభ కనబర్చారు. ఎన్‌సీసీ-32 తెలంగాణ బెటాలియన్ సీవో కల్నల్ వికాస్ శర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. బెస్ట్ ఫైరింగ్ ఓవరల్ క్యాంపులో ప్రథమ స్థానంలో కే అజయ్, ద్వితీయ స్థానంలో జే శేఖర్, బెస్ట్ యాంకర్ ఆర్ యువరాజ్, ఓవరల్ చాంపియన్ ఇన్ వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో మహదు అండ్ టీమ్ నిలిచారు. ఎన్‌సీసీ వార్షిప్ క్యాంపులో మెరిసిన విద్యార్థులను పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ హరిరాం, పీడీ దిలీప్, బ్రిజేశ్ కుమార్ అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 23: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. శనివారం శ్యాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మండల సమైఖ్య మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక అక్షరాస్యత, చట్టాలు, సఖీ కేంద్రం అందిస్తున్న సేవలు, 181ఉమెన్ హెల్ప్ లైన్ గురించి, సైబర్ క్రైం, మిషన్ శక్తి పథకం గురించి వివరించారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోను చేయాలని సూచించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నిక్లేశ్వర ఫైనాన్స్ లిటర్సీ, కోటేశ్వర జెండర్ స్పెషలిస్ట్ సభ్యులు ఏపీఎం, సీసీలు, ఉపాధ్యాయులు, వీవోవోలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు



పోస్టర్ విడుదల చేస్తున్న సిబ్బంది, మహిళలు

కొలాం ఆదివాసీ గిరిజనులకు సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్23 : ఆదిలాబాద్ జిల్లాలలోని కొలాం ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించడానికి గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తున్నామని ఎంపీవో సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ(ఎం), ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లింగూడ గ్రామాల్లో మౌలిక సదుపాయలతో పాటు అభివృద్ధి పనులపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం-జేఏఎన్ఎంఎన్ పథకం ద్వారా కొలాం ఆదివాసీ గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. సీసీరోడ్లు, తాగునీటి, విద్యుత్, మురుగుకాలువలు, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఇండ్లు, వ్యక్తిగత రుణాలపై సర్వేలు చేశామన్నారు. గుర్తించిన వివిధ రకాల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయాలన్నారు. చేసి నివేదికలు జిల్లా అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి జీపీ ఈవో సంజీవరావ్, కేస్లాపూర్ జీపీ కార్యదర్శి మహ్మద్ మోతేశాం, మాజీ సర్పంచ్‌లు మెస్రం నాగ్‌నాథ్, కోరెంగా సుంకట్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోథ్, డిసెంబర్ 23: మండలంలోని పట్నాపూర్ గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం నాగమల్యాల గ్రామానికి చెందిన ఆత్రం నవీన్ స్కూటీపై రేండ్లపల్లె గ్రామానికి వెళ్తున్నాడు. పట్నాపూర్ సమీపంలో రోడ్డుపై వాకింగ్ చేస్తున్న ఆత్రం మోహన్ అనే వ్యక్తిని వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆత్రం నవీన్, మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా బోథ్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో ఆత్రం నవీన్‌కు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఆత్రం మోహన్ బోథ్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

మత్తు పదార్థాలకు దూరం ఉండాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్ 23: ప్రభుత్వం నిషేధించిన మత్తు పదార్థాలకు విద్యార్థులతో పాటు యువత దూరంగా ఉండాలని ఏఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, భగత్‌సింగ్‌నగర్, లిమ్‌గూడ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిషేధిత మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం నిషేధించిన డ్రగ్స్‌తో పాటు గంజాయి, వివిధ రకాల మత్తు పదార్థాలను ఎవరైన తీసుకున్నట్లు సమాచారం అందితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకం పనులు వేగవంతం చేయాలి

బోథ్, డిసెంబర్ 23: ఉపాధి హామీ పథకం కింద నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు వేగవంతం చేయాలని మండల పంచాయతీ అధికారి జీవన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కుచులాపూర్, బీర్లగొంది గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ చంద్రమోహన్, ఎఫ్ఏ వినోద్, జేపీఎస్‌లు, సిబ్బంది ఉన్నారు.